గురువారం సంత.. పశువులతో చింత!



కర్రతో పశువులను అదిలిస్తున్న వ్యాపారులు



- దుకాణాలపై ఎగబడుతున్న పశువులు
- బెంబేలెత్తుతున్న వ్యాపారులు, కొనుగోలుదారులు
- పట్టించుకోని సింహాచలం దేవస్థానం అధికారులు
- ఫిర్యాదులున్నా.. జీవీఎంసీ చర్యలు సున్నా..!

అడవివరంలో ప్రతి గురువారం జరిగే వారాంతపు సంతలో పశువుల సంచారంతో వర్తకులు, కొనుగోలుదారులు బెంబేలెత్తుతున్నారు. ఆవులు, ఎద్దులు సంతలో యథేచ్ఛగా తిరుగాడుతున్నాయి. అవి.. ఏ సమయంలో ఎటువేపు నుంచి వచ్చి, దుకాణాలపైకి, జనాల మీదికి ఎగబడతాయోనని భయాందోళన చెందుతున్నారు. ఆశీల వసూళ్లపై చూపే శ్రద్ధ, తమ ఇబ్బందుల పరిష్కారంపై దేవస్థానం అధికారులగానీ, జీవీఎంసీ యంత్రాంగంగానీ చూపట్లేదని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



గురువారం సంతలో కొనుగోలుదారుల రద్దీ



దుకాణంపైకి ఎగబడి కూరగాయలు తినేస్తున్న ఎద్దు

సింహాచలం: అడవివరం కూడలిలో దేవస్థానానికి చెందిన ప్రదేశంలో ప్రతి గురువారం వారాంతపు సంత జరుగుతుంది. కొత్తవలస, పెందుర్తి, చింతలగ్రహారం, కె.కోటపాడు, లండ గరువు, విజినిగిరిపాలెం తదితర ప్రాంతాల నుంచి రైతులు, వ్యాపారులు కూరగాయలు, ఆకుకూరలు తీసుకొచ్చి సంతలో విక్రయాలు జరుపుతారు. ఆయా ప్రాంతాల నుంచి 60 మందికి పైగా వర్తకులు, రైతులు వ్యయ ప్రయాసలకోర్చి, ఆటోల్లో, ద్విచక్ర వాహనాలపై సరకుల్ని సంతకు తీసుకొస్తారు. మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 9 వరకు సంత జరుగుతుంది. దబ్బంద, ఎస్.ఆర్.పురం, దువ్వపాలెం, అడవివరం, పైనాపిల్‌కాలనీ, శ్రీనివాస్‌నగర్, బాలాజీనగర్ తదితర 15 గ్రామాల ప్రజలకు ఈ సంత చాలా కీలకం

ఆశీల మీదే శ్రద్ధ..!

సంత జరిగే ప్రాంతంలో టూరిస్ట్ బస్సులు, వాహనాల పార్కింగ్‌తో పాటు, ప్రతి గురువారం సంతకు వచ్చే వ్యాపారుల నుంచి ఆశీల వసూళ్లకు దేవస్థానం ఏటా వేలం పాట నిర్వహిస్తుంది. ఈ వేలం పాట ద్వారా దేవస్థానానికి రూ.లక్ష 6 వేలు ఆదాయం వచ్చింది. పార్కింగ్ రుసుములు కాకుండా, సంతలో ఏర్పాటు చేసే దుకాణాల పరిమాణం ఆధారంగా రూ.10, రూ.20 చొప్పున సదరు కాంట్రాక్టర్ ఆశీలు వసూలు చేస్తుంటారు. దేవస్థానం, సదరు కాంట్రాక్టర్ సంతనను ఆశీలు వసూలయ్యే ఆదాయ వనరుగానే చూస్తున్నారు తప్ప, అక్కడ వ్యాపారుల, కొనుగోలుదారుల ఇబ్బందుల్ని మాత్రం పట్టించుకోవట్లేదు. సంతలోకి పశువులు చొరబడకుండా చర్యలు తీసుకోవడం లేదు. కనీస భద్రత కూడా కల్పించట్లేదు. అడవివరం గ్రామస్తులు కూడా తమ పశువుల్ని మేత కోసం సంతలోకి తోలేస్తున్నారన్న అభియోగాలున్నాయి. వీటి నియంత్రణకు చర్యలు తీసుకోవాలని దేవస్థానం అధికారులను, జీవీఎంసీ జోనల్ యంత్రాంగాన్ని పలుమార్లు కోరినా ఫలితం మాత్రం కానరాలేదని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పశువుల సంచారంతో ఇక్కట్లు

ఇక్కడ సంత జరిగేటప్పుడు పశువుల సంచారం ఎక్కువగా ఉండటంతో వ్యాపారులు, కొనుగోలుదారులు ఆందోళన చెందుతున్నారు. సాయంత్రం 4 నుంచి 6 మధ్య ఇసుకేస్తే రాలనంతగా సంతలో కొనుగోలు దారులు కిక్కిరిసి ఉంటారు. ఆ సమయంలో ఎద్దులు, ఆవులు పెద్ద ఎత్తున సంతలోకి చొరబడుతున్నాయి. కిక్కిరిసి ఉన్న కొనుగోలుదారుల మధ్య నుంచి దూసుకెళ్తున్నాయి. దీంతో వారంతా భయంతో పరుగులు తీస్తూ పడిపోతున్న పరిస్థితులూ ఉన్నాయి. వ్యాపారుల దుకాణాల మీదపడి కూరగాయలు, ఆకుకూరల్ని తినేస్తున్నాయి. దీంతో ఇటు వ్యాపారం చూసుకోలేక.. మరోవైపు పశువుల్ని అదిలించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి వ్యాపారీ తమతో పాటు ఇంటి నుంచి కర్రల్ని కూడా తెచ్చుకోవాల్సిన దుస్థితి.

ఇబ్బందులు పడుతున్నాం



సంతలో పశువుల సంచారంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ఎటు వైపు నుంచి వచ్చి, కూరగాయలు తినేస్తాయో అని భయపడుతున్నాం. దూరప్రాంతాల నుంచి ఆటోలకు అధిక ధరలు వెచ్చించి కూరగాయలు తెస్తున్నాం. లాభాల మాటెలా ఉన్నా.. పెట్టుబడి వస్తే చాలనుకుంటాం. కానీ పశువులతో కారణంగా తిప్పలు తప్పట్లేదు.

– సింహాచలం, కూరగాయల వ్యాపారి, కె.కోటపాడు

కాపలా కాయాల్సి వస్తోంది



నేను ఆకుకూరలను సంతకు తీసుకొస్తాను. సంతలో తిరుగాడుతున్న పశువులు దుకాణంపై పడి తినేస్తున్నాయి. కర్రతో అదిలించినా, కొట్టినా కూడా వెనక్కి వెళ్లట్లేదు. సంత జరిగే సమయానికి ఎక్కడి నుంచి వస్తున్నాయో తెలియదు కానీ.. పెద్ద ఎత్తున ఒకేసారి సంతలోకి ప్రవేశిస్తున్నాయి. వ్యాపారులకు తీవ్ర నష్టాన్ని తీసుకొస్తున్నాయి.

– జగదీష్, ఆకు కూరల వ్యాపారి చింతలగ్రహారం

మీదికి దూసుకొస్తున్నాయి



నేను కూరగాయలు కొనుగోలు చేసేటప్పుడు ఎద్దు దూసుకుంటూ వచ్చింది. దీంతో నాతోపాటు, అక్కడున్న వారంతా చాలా భయపడ్డారు. పక్కకు తప్పుకోలేకపోయాను. కింద పడిపోయే పరిస్థితి. నా పక్కన ఉన్నవాళ్లు పడిపోయారు. చేతిలో ఉన్న సంచుల్లోని కూరగాయల్ని నోట కరుచుకుని పోతున్నాయి. ఎవరూ పట్టించుకోవడం లేదు.

– నర్సమ్మ, కొనుగోలుదారు, అడవివరం

క్లుప్తంగా

వైభవంగా మరిడిమాంబ పరస



అన్నసమారాధన ప్రారంభిస్తున్న గండి బాబ్జి, స్థానిక పెద్దలు

పెందుర్తి: పురుషోత్తపురం మరిడిమాంబ కాలనీ గ్రామదేవత మరిడిమాంబ పరస ఆదివారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పసుపు–కుంకుమలు, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. తప్పెటగుళ్లు, సాముగరిడీలు, కోలాటాలు సందడిగా సాగాయి. మధ్యాహ్నం జరిగిన భారీ అన్నసమారాధనలో దాదాపు 5 వేల మంది అన్నప్రసాదం స్వీకరించారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. డ్యాన్స్ బేబీ డ్యాన్స్ కార్యక్రమం అలరించింది. రంగులరాట్నాలు, వివిధ రకాల ఆట పరికరాలతో పిల్లలు సందడి చేశారు. ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, రాష్ట్ర అయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జి, కార్పొరేటర్లు ముమ్మన దేముడు, బల్ల శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ పిల్లల అప్పలనాయుడు, నాయకులు చీర అప్పలరాజు, పిల్లల శ్రీనివాసరావు, బమ్మిడి బాలాజీ, చందుయాదవ్ పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా ధ్వజస్తంభం ప్రతిష్ట



పూజలు చేస్తున్న భక్తులు

పెందుర్తి: స్థానిక రామానంద జ్ఞానానంద సాధుమఠం ప్రాంగణంలోని రామలింగేశ్వర స్వామి ఆలయంలో నూతన ధ్వజస్తంభం ప్రతిష్టాపన ఆదివారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముందుగా శివాలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం రాంపురం వాసి అనుపోజు రాజు దంపతుల ఆర్థిక సాయం రూ.3.20 లక్షలతో ఏర్పాటు చేసిన ధ్వజస్తంభాన్ని ప్రతిష్టించారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో సాధు మఠం ప్రతినిధి శ్రీనివాసానంద స్వామి, జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ రెడ్డి నారాయణరావు, మాజీ ఎంపీపీ రెడ్డి వరలక్ష్మి, మాజీ ఎంపీటీసీ వెన్నెల సన్యాసిరావు, ఆశ్రమ నిర్వాహకుడు బోకం జ్ఞానేశ్వరరావు, నాయకులు అన్నంరెడ్డి శ్రీనివాస్, ఎ.బంగారునాయుడు, ఎ.బంగారయ్య తదితరులు పాల్గొన్నారు.

సరస్వతీదేవిగా దుర్గమ్మ



సరస్వతీదేవి అలంకరణలో దుర్గమ్మ

పెందుర్తి: మాఘ మాస శుద్ధ పంచమి(వసంత పంచమి) సందర్భంగా ఎస్ఆర్‌పురంలోని దుర్గాదేవి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిపారు. అమ్మవారు సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. విద్యార్థులతో సరస్వతి పూజ చేయించారు. అక్షరాభ్యాసాలు జరిగాయి. ఆలయ ధర్మకర్త కాయిత ఎర్రిబాబు ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

ముగ్గురు బాలల అదృశ్యం.. వెతికి పట్టుకున్న పోలీసులు

పెందుర్తి: పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధి వేపగుంట ప్రాంతంలోని ఇద్దరు బాలికలు, ఒక బాలుడు అదృశ్యం కలకలం రేపింది. అయితే పోలీసులు సకాలంలో స్పందించి వారికి వెతికి పట్టుకుని తల్లి దండ్రులకు అప్పగించడంతో కథ సుఖాంతం అయింది. వివరాలివి.. వేపగుంట సమీపంలోని ముత్యమాంబ కాలనీకి చెందిన ఆదిత్య సాహు(9), లక్ష్మి సాహు(8), గొర్లి గంగోత్రి(9) గత నెల 31 ఉదయం ఆడుకోవడానికి ఇంటి నుంచి బయటకు వెళ్లారు. తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు కాలనీలో, బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద ఆరా తీశారు. ఫలితం లేకపోవడంతో శనివారం రాత్రి ఆదిత్య సాహు తల్లి పూజ పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వెంటనే సీఐ కె.వి.సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో రంగంలోకి దిగిన ఐదు బృందాలు తీవ్రంగా గాలించాయి. ఆదివారం ఉదయం వారిని మన్యం జిల్లా మొక్కు మండలం సంబరం గ్రామంలో గుర్తించారు. వెంటనే అక్కడి నుంచి తీసుకువచ్చిన ఎస్ఐ అసిరితాత బృందం.. వారికి సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



నిత్యకల్యాణంలో కంకణ ధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణపుష్పార్చన ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం జరిపారు. 108 స్వర్ణసంపెంగలతో అష్టోత్తరశతనామావళి పూజ చేశారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు. ఆలయ ఏఈవో ఆనంద్ కుమార్, సూపరింటెండెంట్ జీవీవీఎస్‌కే ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైభవంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్య కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేసి, ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని ఘనంగా జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

నేటి నుంచి శారదాపీఠం వార్షికోత్సవాలు



శారదాపీఠం

పెందుర్తి: చినముషిడివాడలోని శారదాపీఠం వార్షికోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నట్లు పీఠం ప్రతినిధులు తెలిపారు. పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి ఆధ్వర్యంలో మొత్తం ఐదు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. 3న సామూహిక అక్షరాభ్యాసాలు, చంద్రమౌళీశ్వరస్వామికి అభిషేకాలు, 4న సుబ్రహ్మణ్యస్వామికి పంచామృతాభిషేకం, రాజశ్యామల యాగం ప్రారంభమవుతాయన్నారు. 5న విజయ గణపతికి పంచామృతాభిషేకం, లక్ష్మీగణపతి, మన్యుసూక్త హోమాలు, రాజశ్యామల సౌభాగ్యవ్రతం జరుగుతాయన్నారు. 6న మేధా దక్షిణామూర్తికి అభిషేకాలు, వల్లీ కల్యాణం చేయనున్నట్లు తెలిపారు. ఆఖరి రోజైన 7న మహాపూర్ణాహుతితో ఉత్సవాలు ముగుస్తాయన్నారు.

గిరిజన ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం



ప్రమాణ స్వీకారం చేస్తున్న సంఘం ప్రతినిధులు

పెందుర్తి: పెందుర్తి ప్రాంత గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా లకే చిట్టిబాబు, గౌరవాధ్యక్షుడిగా గుజ్జెల దేవరాజు, ముఖ్య సలహాదారులుగా శతక చిట్టయ్య, తాంగుల రంగారావు, న్యాయసలహాదారుగా అంబిడి రాజయ్య, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా అడపా తిరుపతివెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా దీసరి భాస్కరరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా రొబ్బ వెంకటరావు, కోశాధికారిగా శెట్టి జయదాస్, 35 మంది కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర గిరిజన ఐక్యవేదిక అధ్యక్షుడు కొక్కుల రామారావు ఆధ్వర్యంలో నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం చేసింది. పెందుర్తి ప్రాంతంలో నివాసం ఉంటున్న దాదాపు 500 మంది గిరిజన ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తీర్మానం చేశారు.

ధ్యానం నిత్య జీవనంలో భాగం కావాలి

పెందుర్తి: మానవ జీవనంలో ధ్యానం ఓ భాగం కావాలని హైదరాబాద్‌కు చెందిన ధ్యాన గ్రాండ్ మాస్టర్ నరేంద్ర మొదల్కర్ అన్నారు. శాకాహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యం సంతరించుకుంటుందన్నారు. పాపయ్యరాజుపాలెంలోని పిరమిడ్ ధ్యాన కేంద్రంలో ఆదివారం ధ్యాధ్యాని, విజ్ఞాని₹ అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధ్యానం ఒత్తిడిని జయించేలా చేస్తుందన్నారు. మారుతున్న ఆహారపు అలవాట్లు, నిరంతర జీవన ప్రక్రియలో ధ్యానం ఎంతో అవసరం అన్నారు. ధ్యాన కేంద్ర నిర్వాహకులు, ధ్యాన మాస్టర్లు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు

పెందుర్తి: స్థానిక యూనిక్ పాఠశాల పూర్వ విద్యార్థులు రెండు దశాబ్దాల తరువాత కలిశారు. 2005–06 టెన్త్ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం పెందుర్తిలోని ఓ కల్యాణ మండపంలో ఆడీపాడీ సందడి చేశారు. పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. సహపంక్తి భోజనాలు చేశా రు. నాటి ఉపాధ్యాయులను సత్కరించారు.

ఆదిత్యునికి అభిషేకాలు



పూజలందుకు సూర్యనారాయణస్వామి

పెందుర్తి: మాఘమాసోత్సవాల్లో భాగంగా సుజాత నగర్లోని సూర్యనారాయణస్వామి దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. వేకువజామున స్వామివారికి పంచ ద్రవ్యాలతో విశేష అభిషేకాలు చేశారు. అలంకరణ తర్వాత ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులతో పాయసం వండించి స్వామికి నివేదించారు. ఆలయ ప్రధాన అర్చకుడు సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో ఆదిత్యునికి పంచ హారతి, నక్షత్ర హారతి ఇచ్చారు. ఆలయ ధర్మకర్త వాకా చంద్రశేఖర్‌రెడ్డి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీనివాస కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

పెందుర్తి: స్థానిక వేంకటాద్రి క్షేత్రంలో కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం నిత్య కల్యాణం జరిపారు. స్వామివారికి విశేష పూజలు చేశారు. అనంతరం శ్రీనివాస కల్యాణం వైభవంగా నిర్వహించారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

రేపు సింహగిరిపై రథసప్తమి వేడుకలు

- ఉదయం రాతిరథంపై స్వామికి అభిషేకాలు
- సాయంత్రం సూర్యప్రభ వాహనంపై తిరువీధి



సింహగిరి ఆలయ ప్రాంగణంలో హంసమూలన ఉన్న రాతి రథం

సింహాచలం: సింహగిరిపై మంగళవారం రథసప్తమి వేడుకల్లో భాగంగా విశేష పూజలు నిర్వహించేందుకు దేవస్థానం అధికార, వైదికులు ఏర్పాట్లు చేస్తున్నారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయ ప్రాంగణంలో హంసమూలన స్వామివారు ఉభయ దేవేరులతో దర్శనమివ్వనున్నారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఉదయం రాతిరథంపై అధిష్టింపజేసి అభిషేకాలు, అరుణ పారాయణం, విశేష పూజలు జరుపుతారు. అనంతరం 9.30 నుంచి రాతిరథం పైనే నిత్యకల్యాణం నిర్వహిస్తారు. సాయంత్రం 5 గంటల నుంచి సింహగిరి మాడ వీధిలో సూర్యప్రభ వాహనంపై తిరువీధి జరగనుంది.

శ్రీకృష్ణాపురంలోని గోశాలలో.. సింహాచలం దేవస్థానానికి చెందిన శ్రీ కృష్ణాపురంలోని గోశాలలో ఉన్న భారీ సప్తవాహన ఏక చక్ర రథసారథి సమేత సూర్యనారాయణస్వామి చెంతన మంగళవారం ఉదయం 8 గంటల నుంచి విశేషంగా పూజలు నిర్వహించనున్నట్లు దేవస్థానం ఈవో వి.త్రినాథరావు తెలిపారు. స్వామివారి సన్నిధిలో పంచామృతాభిషేకాలు, అరుణ హోమం, అరుణ పారాయణం, సూర్యనమస్కారాల కార్యక్రమాలను చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. భక్తులంతా ఈ పూజా కార్యక్రమాల్లో పాల్గొనాల్సిందిగా కోరారు.

ఘనంగా పసలమ్మ తీర్థమహోత్సవం



పసలమ్మ అమ్మవారికి పూజలు చేస్తున్న బూడి ముత్యాలనాయుడు, అదీప్‌రాజ్ తదితరులు



పసలమ్మ సన్నిధిలో గుడివాడ అమర్‌నాథ్, అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తదితరులు

సబ్బవరం: మండలంలోని అనకపల్లి పంచాయతీ పరిధి సున్నంబట్టీలు గ్రామంలో కొలువైన పసలమ్మ అమ్మవారి తీర్థమహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. భక్తులు వేకువజాము నుంచే అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కాపుశెట్టి శేషుబాబు ఆహ్వానం మేరకు మాజీ డిప్యూటీ సీఎం, పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు అమ్మవారిని దర్శించుకున్నారు. అదే విధంగా మాజీ మంత్రి, పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, పార్టీ సీనియర్ నాయకుడు గండి రవికుమార్, ఎంపీటీసీ కర్రి అప్పారావు, మండల పార్టీ కన్వీనర్ కర్రి బాబు, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్‌రాజ్, సబ్బవరపు నారాయణమూర్తి, మామిడి కొండాజీ, యడ్ల నాయుడు, ఐడీ బాబు, పెచ్చేటి రమేష్‌నాయుడు, బలిరెడ్డి రామచంద్రరావు, స్థానిక పార్టీ నాయకులు అమ్మవారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

తీరంలో సండే సందడి



తిక్కవానిపాలెం తీరంలో జలకాలాటల్లో సందర్శకులు

పరవాడ: సందర్శకుల తాకిడితో తిక్కవానిపాలెం, ముత్యాలమ్మపాలెం తీర ప్రాంతాలు ఆదివారం సందడిగా మారాయి. పట్టణ, గ్రామీణ ప్రాంతాల నుంచి తరలివచ్చిన పర్యాటకులు, సందర్శకులు తీర ప్రాంతాల్లోని ఇసుక తిన్నెలపై కబడ్డీ, క్రికెట్, వాలీబాల్ తదితర ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. తీరంలో దిగి జలకాలాటలతో సాయంత్రం వరకు సరదాగా చిందులు వేశారు. మొబైల్ ఫోన్లతో ఫొటోలు తీసుకున్నారు. చీకట్లు పడుతున్నవేళ ఆనందంగా తిరుగుముఖం పట్టారు.